తొలివెలుగు జాతీయపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.

సెల్ : 9491134365

TGTEL/26/A6221

తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

యాదాద్రి భువనగిరి	సంపుటి: 01	సంచిక : 52	శుక్రవారం	18 సెప్టెంబర్ 2026	ఎడిటర్: యంజాల ప్రవీణ్	పేజీలు: 08	వెల: రూ.2/-
Yadadri Bhuvanagiri	Volume:01	Issue:52	Friday	18 September 2026	Editor:Yamjala praveen	Pages:08	Cost:2/-

ఇదో రాజనీతిజ్ఞత, ధైర్యం, త్యాగాల గాథ

- దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఓ కీలక ఘట్టానికి ముగింపు
- ప్రజా ఉద్యమంలో విద్యార్థులు, మేధావులు, సామాన్య పౌరుల భాగస్వామ్యం
- జాతీయ సమగ్రతకు బాటలు వేయాల్సిన ఆవశ్యకతను ఈ ఘట్టం గుర్తుచేస్తుంది
- హైదరాబాద్ విమోచన దినోత్సవంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- ఇది స్వాతంత్ర్య దినోత్సవం కాదు.. సంకల్ప దినోత్సవం: కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్
- జాతీయ చరిత్రలో అత్యంత విశిష్టమైన రోజు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

హైదరాబాద్: విభిన్న రాజకీయ పరిస్థితుల నడుమ ఎన్నో సంఘర్షణలకు గురైన ప్రజలను ఏకతాటి పైకి తేవడంలో ఒక నవ స్వతంత్ర దేశం ఎదుర్కొన్న అసంఖ్యాక సవాళ్లను హైదరాబాద్ చరిత్ర ప్రతిబింబిస్తుందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చెప్పారు. ఈ పరిణామాలను రాజనీతిజ్ఞత, ధైర్యం, త్యాగాల గాథగా ఆయన అభివర్ణించారు. ప్రతి పౌరుడికీ సమాన స్థాయినిచ్చే రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య సౌధం నిర్మించే దిశగా నిరంతర, బృహత్తర ప్రక్రియ కొనసాగిందని అన్నారు. హైదరాబాద్ విమోచన నేపథ్యంలో సాగిన ప్రజా ఉద్యమాన్ని ఆయన కొనియాడారు. ఆనాడు విద్యార్థులు, మేధావులు, రచయితలు, సామాజిక, రాజకీయ కార్యకర్తలు, రైతులు సహా సామాన్య పౌరులు కూడా ఈ పోరాటంలో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. ఈ క్రమంలో అనేకమంది కఠిన కారాగార వాసం, హింస, అంతులేని వ్యక్తిగత కష్టనష్టాలకు గురయ్యారని తెలిపారు. రామ్‌జీ గోండ్, తుర్రేబాజ్ ఖాన్, కొమురం భీమ్ వంటి దేశభక్తులకు ఈ సందర్భంగా ఆయన నివాళులర్పించారు.

- మిగతా 2వ పేజీలో

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..

- రంగంలోకి రెవెన్యూ అధికారులు
- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
- సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక

2లో

మోదీకి చంద్రబాబు, లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు

- మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ చరిత్రాత్మకమని కొనియాడిన టీడీపీ అధినేత
- ప్రధాని స్ఫూర్తిదాయక ప్రస్థానాన్ని ప్రశంసించిన నారా లోకేశ్
- దేశాభివృద్ధికి మోదీ నాయకత్వం కొత్త ఊపునిచ్చిందని వ్యాఖ్య
- వారణాసిలో ప్రధాని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొననున్న చంద్రబాబు

దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి అండగా నిలవాలని పిలుపునిచ్చిన చంద్రబాబు

- వారణాసిలో చంద్రబాబు ప్రసంగానికి జేజేలు..
- మంత్రంతో భారత్ అభివృద్ధి ప్రస్థానం అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్య
- అయోధ్యలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని యూపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రసంగానికి వారణాసిలో విశేష స్పందన, చప్పట్లతో మార్మోగిన సభా ప్రాంగణం
- ప్రధానిగా మోదీ 25 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా వారణాసిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం

"ప్రధాని నరేంద్ర మోదీ సరైన సమయంలో సరైన నాయకుడు (రైట్ టైమ్.. రైట్ లీడర్). ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, కేవలం దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి మనమందరం అండగా నిలవాలి. ఎన్డీయే ఐక్యతే ఈ దేశానికి బలం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'వారణాసి-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్'

దేశ సేవకు అంకితమైన స్ఫూర్తిదాత మోదీ

- కొనియాడిన బీజేపీ శ్రేణులు
- ప్రధానమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు
- తెలియజేసిన కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు
- మోదీని అవిశ్రాంత కృషి, త్యాగం, దూరదృష్టికి ప్రతీక: అమిత్ షా

2లో

అమరుల త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించుకున్నాం

- ఆ చరిత్ర, ఉద్యమాల ఫలాలు ప్రజల్లో కనిపించాలి
- రైతుకు భరోసా ఉండాలి.. మహిళలు ఆర్థికంగా ఎదగాలి
- పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి
- యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి
- నిజాం పాలనలో పలు రంగాల్లో హైదరాబాద్ పురోగతి
- ప్రజా పాలన దినోత్సవాల్లో ముఖ్యమంత్రి ప్రసంగం

హైదరాబాద్: అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రజా పాలనకు పునాదులని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'సెప్టెంబర్ 17 మనకు గతాన్ని మాత్రమే గుర్తు చేసే రోజు కాదు. మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక ఘట్టం. సకల జనుల ఉద్యమం, ఎన్నో పోరాటాలు, అమరుల త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఇప్పుడు ఆ చరిత్ర, ఆ ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. అభివృద్ధి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ చేరాలి. చరిత్రను మరిచిపోం. చరిత్ర దగ్గరే ఆగిపోం. ఆ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందాం. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల భాగస్వామ్యంతో... తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందాం'అని అన్నారు. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన ప్రజా పాలన దినోత్సవాల్లో ముఖ్యమంత్రి మువ్వన్నెల జెండా ఎగురవేశారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులందరికీ ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం

- మిగతా 2వ పేజీలో

బాబు నిర్వాకం వల్లే కరువు తీవ్రరూపం

- ఎల్‌నినో ప్రభావంపై ఫిబ్రవరి 4నే వెల్లడి
- అయినా పరిస్థితి ఎదుర్కోవడంలో కార్యాచరణ 'సున్నా'
- వర్షపాతం లోటు స్పష్టంగా కనిపిస్తున్నా స్విచ్‌లు
- నొక్కి, లాకులు ఎత్తి, ఫొటోలకు ఫోజులిచ్చి డ్రామాలు
- మీ మాటలు నమ్మి సాగులోకి దిగిన రైతులు నిండా మునిగారు
- ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం..
- కష్టంలో ఆదుకునే ఉచిత పంటల బీమా రక్షణ లేకుండా పోయింది
- కరువు మండలాలు ఎందుకు ప్రకటించలేదు?

రష్యాపై ఆంక్షలు

చైనా, భారత్‌లపై భారీ టారిఫ్‌ల వడ్డన బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఓకే

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

బాబు నిర్వాకం వల్లే కరువు తీవ్రరూపం

అమరావతి: రాష్ట్రంలో ఉన్నది 'ఎల్‌నినో' ఎఫెక్ట్ కాదు.. 'ఎల్లో నినో ఎఫెక్ట్' అని.. ఇది ప్రకృతి వల్ల వచ్చిన కరువు మాత్రమే కాదని, సీఎం చంద్రబాబు నిర్వాకం వల్లే మరింత తీవ్రత పెరిగిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావంపై ఫిబ్రవరి 4నే వెల్లడించిన సీఎం చంద్రబాబు.. వచ్చే పరిస్థితిని ఎదుర్కోవడంలో మాత్రం ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదంటూ ఆక్షేపించారు. వర్షపాతం లోటు స్పష్టంగా కనిపిస్తున్నా డ్రామాలు ఆడారని ధ్వజమెత్తారు. స్విచ్‌లు నొక్కడం, లాకులు ఎత్తడం, ఫొటోలకు పోజులివ్వడం మాత్రమే చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం మాటలు నమ్మి సాగులోకి దిగిన రైతులు ఇప్పుడు తీవ్ర కరువు పరిస్థితుల్లో నిండా మునిగారని, ప్రతి ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పుణ్యాన రైతులకు అన్నీ కష్టాలేనని.. ఉచిత పంటల బీమా రక్షణ లేకుండా పోయిందని నిప్పులు చెరిగారు. శ్రీశైలం నుంచి రాయలసీమకు సకాలంలో నీళ్లు ఇవ్వలేదని.. విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వదిలేశారని.. పులిచింతల ఎగువ, దిగువన తెలంగాణ ఎడాపెడా లిఫ్ట్‌ల నిర్మాణం చేపట్టినా చంద్రబాబు నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్, జూలై, ఆగస్టులో వరుసగా మూడు నెలలు వర్షపాతం లోటు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించ లేదంటూ వైఎస్ జగన్ తప్పుబట్టారు. కరువు మండలాలు ఇంకా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. కర్ణాటక చాలా ముందుగానే ఆ పని చేసిందని గుర్తు చేశారు. కరువు ముంచుకొస్తున్నా ప్రత్యామ్నాయ విత్తనాలు సిద్ధం చేయలేదని, పశు గ్రాసాన్ని జిల్లాలకు పంపలేదని, కనీసం ఉపాధి హామీ అదనపు పనిదినాలు కూడా కోరలేదంటూ దుయ్యబట్టారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు, ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేని పరిస్థితిపై పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు, అన్ని జిల్లాల అధ్యక్షులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని అక్కడి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఏమన్నారంటే.. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులు గమనిస్తే ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇవాళ్టి (సెప్టెంబర్ 16) వరకు దాదాపు 51 శాతం పైచిలుకు లోటు వర్షపాతం కనిపిస్తోంది. 28 జిల్లాలకు గాను 28 జిల్లాలూ ఈరోజు వర్షపాతం లోటులోనే ఉన్నాయి. 688 మండలాలకు గాను దాదాపు 628 మండలాలు వర్షాభావ పరిస్థితుల్లో ఉంటే, తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు సుమారు 332 మండలాల్లో కనిపిస్తున్నాయి. అంటే దాని అర్థం 51 శాతం పైచిలుకు వర్షపాతం లోటు ఉన్న పరిస్థితి. అన్నమయ్య జిల్లా--75%, సత్యసాయి జిల్లా--66%, ప్రకాశం జిల్లా--65%, చిత్తూరు జిల్లా--58.5%, వైఎస్సార్ కడప జిల్లా--57%, తూర్పు గోదావరి జిల్లా --57%, మార్కాపురం జిల్లా --56%, నంద్యాల జిల్లా--56%, విశాఖపట్నం జిల్లా--54%, అనంతపురం జిల్లా--51%, కర్నూలు జిల్లాలో 50% పైచిలుకు. ఇంత తీవ్రమైన లోటు వర్షపాతం రాష్ట్రం అంతటా కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందుగా తెలియనిది కాదు. రాష్ట్రంలో ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపనుందని, ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తారీఖున సీఎం చంద్రబాబే స్వయంగా చెప్పారు. ఆ విషయం చెప్పిన ఈ పెద్దమనిషి ఆ తర్వాత ఏం చేశాడు? అన్నది గమనిస్తే కనిపించేది పెద్ద సున్నా. ఈ మనిషి కార్యాచరణకు వచ్చేసరికి చేసింది ఏమీ లేదు. అంతా సున్నా.. సున్నా. అందుకనే ఇది 'మ్యాన్ మేడ్ కరువు'. ముఖ్యమంత్రి అనే వ్యక్తి స్పందించాల్సిన రీతిలో స్పందించకపోవడం వల్ల జరిగిన నష్టం ఎంత తీవ్రంగా ఉంటుంది అన్నదానికి ఇది ఒక ఉదాహరణ.

రష్యాపై ఆంక్షలు

వాషింగ్టన్: రష్యాపై ఆంక్షలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కట్టబెట్టే బిల్లుకు ఆ దేశ ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోళ్లు చేస్తున్న భారత్, చైనాలపై భారీ ఎత్తున టారిఫ్‌లు విధించేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది. 'ద లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026'పేరున్న ఈ చట్టాన్ని సెనేట్ గత నెలలోనే ఆమోదించింది. తాజాగా బుధవారం సాయంత్రం ప్రతినిధుల సభ 262--159 ఓట్లతో ఓకే చెప్పింది. అధ్యక్షుడు ట్రంప్ సంతకం పెట్టిన వెంటనే ఈ బిల్లు కాస్తా చట్టం అవుతుంది. ప్రతినిధుల సభలోని 203 మంది రిపబ్లికన్లతోపాటు 56 మంది డెమొక్రాట్లు, ఒక స్వతంత్ర ప్రతినిధి ఈ బిల్లుకు ఆమోదం తెలపడం గమనార్హం. ప్రతిపక్ష డెమొక్రాట్ పార్టీ ప్రతినిధులు ట్రంప్‌కు టారిఫ్‌లు విధించే అధికారాలపై తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేయడానికి పరిమితమయ్యారు. సౌత్ కరొలీనా సెనేటర్, రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి లిండ్సే గ్రాహం ఏడాది కాలంగా ఈ బిల్లుకు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేసి.. ఈ ఏడాది జూలైలో ఆకస్మిక మరణం పాలయ్యారు. దీంతో బిల్లుకు గ్రాహం పేరునే పెట్టారు. బిల్లుపై జరిగిన చర్చలో డెమొక్రాట్ ప్రతినిధి రిచర్డ్ నీల్ మాట్లాడుతూ "టారిఫ్‌లు విధించే విషయంలో ట్రంప్‌కు ఎక్కువ అధికారాలు ఇవ్వడంపై మాత్రమే తమ అభ్యంతరం"అని స్పష్టం చేశారు. ఈ బిల్లు ద్వారా రష్యా నేతలపై మాత్రమే కాకుండా ఇంధన రంగం మొత్తమ్మీద ఆంక్షలు విధించే అధికారాన్ని ట్రంప్‌కు కట్టబెట్టనుంది. అధికారికంగా ఇంధన సరఫరా చేసే నౌకలతోపాటు 'షాడో ఫ్లీట్'లకు కూడా ఆంక్షలు వర్తించనున్నాయి. అదే సమయంలో రష్యా సరఫరా చేసే చమురు, గ్యాస్‌లపై భారత్, చైనా వంటి దేశాలు ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఆయా దేశాలపై టారిఫ్‌లు వడ్డించేందుకు ఈ బిల్లు ట్రంప్‌కు అధికారం ఇస్తుంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అమెరికా పర్యటన మరికొన్ని రోజులు మాత్రమే ఉండగా ఈ బిల్లు ఆమోదం పొందడం గమనార్హం. సెనేట్ ఈ బిల్లును నెలరోజుల క్రితమే 86--11 ఓట్ల తేడాతో ఆమోదించగా ప్రతినిధుల సభలో కొంత ఆలస్యమైంది. నవంబరు మూడున జరిగే మధ్యంతర ఎన్నికలకు ముందు ప్రతినిధుల సభ సమావేశాల చివరిరోజున మాత్రమే ఆమోదం సాధ్యమవడం విశేషం.

ఇదో రాజనీతిజ్ఞత, ధైర్యం, త్యాగాల గాథ

(మొదటి పేజీ తరువాయి)

గురువారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన 79వ హైదరాబాద్ విమోచన దినోత్సవంలో రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'స్వతంత్ర భారత చరిత్రలో ఓ కీలక ఘట్టానికి హైదరాబాద్ సంస్థాన విమోచనం ముగింపు పలికింది. జాతీయ సమగ్రత, సార్వజనీనతకు బాటలు వేయాల్సిన ఆవశ్యకతను ఈ ఘట్టం మనకు గుర్తుచేస్తుంది. ఈ సంస్థాన విమోచనం ద్వారా బలమైన, ఏకీకృత సమైక్య భారత దేశానికి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢమైన పునాది వేశారు. దేశ ఐక్యత కోసం పౌరులందరూ ఒకే రీతిలో ఉండాల్సిన అవసరం లేదు. భిన్న భాషలు, విభిన్న సంప్రదాయాలు, విశ్వాసాలు గలవారై ఉండవచ్చు. అదేవిధంగా భిన్న రాజకీయ అభిప్రాయాల గలవారూ ఉండొచ్చు. అంతిమంగా రాజ్యాంగం, సార్వకచిమాధికారం ప్రజలకే చెందుతాయన్న వాస్తవమే వారిని ఏకతాటిపై నిలుపుతుంది. నేటి వేడుక ఒక చారిత్రక తేదీ సంస్మరణకు మాత్రమే పరిమితం కాబోదు. ఇది భారత ప్రగతి ప్రస్థానాన్ని, దేశ సమైక్యతను సమున్నతంగా నిలిపే విలువలను గుర్తుచేసే సందర్భం. 1947--1948 మధ్యకాలంలో దేశ నిర్మాణంలో కేంద్ర బలగాలు ఎంతో కృషి చేశాయి. నక్సల్ రహిత భారత్, ప్రతి రాష్ట్రం ప్రశాంతంగా శాంతి భద్రతల సమస్యలు లేకుండా ఉండాలన్నది ప్రధాని మోదీ లక్ష్యం.. విజన్. ఇందులో భాగంగా నక్సలిజం నిర్మూలనలో కూడా ఈ బలగాలు ఎంతో కీలక పాత్ర పోషించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో, పర్యవేక్షణలో వామపక్ష తీవ్రవాదమైన నక్సలిజం దేశంలో అంతమైంది. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం పూర్తిగా కనుమరుగైన తర్వాత ఎంతో అభివృద్ధి జరుగుతోంది. రాష్ట్రంలోని యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారు. తర్వాత సంస్థానాల ఏకీకరణకు పటేల్ ఎనలేని కృషి చేశారు. తదుపరి తరంలో నేడు 'వికసిత భారత్--2047'దిశగా ప్రస్థానానికి ప్రధాని మోదీ సమర్థ సారథ్యం వహిస్తున్నారు..'అని ఉప రాష్ట్రపతి చెప్పారు. కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ.. 'ఇది కేవలం స్వాతంత్ర్య దినోత్సవం కాదు..సంకల్ప దినోత్సవం. జాతీయ ఏకతా దినం. హైదరాబాద్ విమోచన దినోత్సవం నుంచి ప్రేరణ పొంది సంకల్పబద్ధంగా ముందుకు సాగి, దేశం వికసిత్ భారత్ వైపు సాగేందుకు సంకల్పం ఉపకరిస్తుంది. దేశంలో అంతే ముఖ్యమైన పరివర్తన ఇప్పుడు మోదీ నేతృత్వంలో సాగుతోంది. సర్దార్ పటేల్ సాహసోపేత 'ఆపరేషన్ పోలో'అన్యాయంపై న్యాయం సాధించిన విజయం. ఇందులో నా స్వస్థలం జ్యోద్‌పూర్‌కు చెందిన సైనిక యోధులు, మా పూర్వీకులు, కుటుంబీకులు కూడా పాల్గొనడం నాకెంతో గర్వకారణం. ఆ విధంగా హైదరాబాద్‌కు జ్యోద్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధం ఉంది. నేను ఇక్కడికి జోద్‌పూర్ ప్రతినిధిగా వచ్చా..'అని షెకావత్ అన్నారు. వికసిత్ భారత్ దిశగా పునరంకితం కావాలి: గవర్నర్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగిస్తూ..జాతీయ చరిత్రలో హైదరాబాద్ విమోచన అత్యంత విశిష్టమైన, చారిత్రాత్మక దినమని చెప్పారు. నాటి పోరాటాలు, పూర్వీకులు పడిన కష్టానష్టాలు, బలిదానాలను నేటి యువత అర్థం చేసుకుని.. ఆ అనుభవాలు, వీరసైనికుల పోరాటం, త్యాగాల పునాదిగా వికసిత్ తెలంగాణ తద్వారా వికసిత్ భారత్ సాధన దిశగా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. 'నిజాం మంచి వాడని పాలకులు అంటున్నారు. అద్భుతమైన పాలన అందించి ఉంటే వందేమాతరం రామచంద్రరావు, భాగ్యరెడ్డి వర్మ, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య వంటి ఎంతోమంది మహానుభావులు నిజాం అణచివేతకు వ్యతిరేకంగా ఎందుకు పోరాడాల్సి వచ్చింది.

దేశ సేవకు అంకితమైన స్ఫూర్తిదాత మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర మంత్రులు, బీజేపీ సీనియర్ నేతలు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని, అభివృద్ధి, సంక్షేమం సుపరిపాలనలో ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. 'దేశ సేవకు అంకితమైన కర్మయోగి, స్ఫూర్తిదాత నరేంద్ర మోదీ'అని కొనియాడారు. మోదీని అవిశ్రాంత కృషి, త్యాగం, దూరదృష్టికి ప్రతీకగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభివర్ణించారు. దేశ సేవనే లక్ష్యంగా మార్చుకున్న మోదీ జీవితం తపస్సు, త్యాగం, అచంచలమైన సంకల్పాల అద్భుత గాథ అని పేర్కొన్నారు. సేవాభావం, అంకితభావంతో కూడిన ఆయన ప్రస్థానం కోట్లాది మంది దేశప్రజలకు స్ఫూర్తిదాయకమని 'ఎక్స్'లో పోస్టుచేశారు. మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి, స్వయం సమృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పేర్కొన్నారు. దేశమే ప్రథమం అనే సంకల్పంతో సాగిన మోదీ ప్రయాణం సేవ, సుపరిపాలన, ప్రజా సంక్షేమంతో కూడిన ఒక స్ఫూర్తిదాయకమైన గాథ అని తెలిపారు. ఇది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన ప్రయాణం మాత్రమే కాదని, దేశ ప్రజల సామూహిక స్వప్నం అని ఉద్ఘాటించారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో మౌలిక సదుపాయాలు, డిజిటల్ కనెక్టివిటీ, సంక్షేమం, ఆవిష్కరణల వంటి రంగాల్లో పురోగతి సాధిస్తూ, 'వికసిత్ భారత్'లక్ష్యం దిశగా దేశం పూర్తి విశ్వాసంతో ముందుకు సాగుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టంచేశారు. మోదీని దేశ సేవ, ప్రజా సంక్షేమం కోసం జీవితంలోని ప్రతి క్షణాన్నీ అంకితం చేసిన కర్మయోగిగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అభివర్ణించారు.

దేశ ప్రయోజనాల కోసం మోదీకి అండగా నిలవాలని పిలుపునిచ్చిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న విప్లవాత్మక మార్పులను సమగ్రంగా వివరించారు. కాశీ క్షేత్రం ప్రధాని మోదీకి కర్మభూమి అని, ఇక్కడి ప్రజలు కేవలం తమ ఎంపీని మాత్రమే కాక, దేశానికి ఓ గొప్ప నాయకుడిని అందించారని చంద్రబాబు అన్నారు. "ఎఖూ (వాద్‌నగర్, కాశీ, సెప్టెంబర్) అనేది నేటి భారత అభివృద్ధి మంత్రం. ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జల్ జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాలతో 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కలిగింది. పీఎం కిసాన్ పథకం ద్వారా 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు అందుతోంది," అని వివరించారు. కరోనా మహమ్మారి సమయంలో 200 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఉత్పత్తి చేయించి, 140 కోట్ల మంది ప్రజలను కాపాడటమే కాకుండా, 101 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మోదీ మానవత్వాన్ని చాటారని కొనియాడారు. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి విధానాలతో ఒకప్పుడు రక్షణ పరికరాలు దిగుమతి చేసుకునే భారత్, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరిందని చంద్రబాబు తెలిపారు. "టెక్నాలజీని పూర్తిస్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండక్టర్ టెక్నాలజీలతో యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నారు. ఆయన దూరదృష్టితో దేశంలో 2.20 లక్షల స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయి. యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగారు," అని అన్నారు. మహిళా సాధికారతకు 'భేటీ బచావో-భేటీ పడావో', 'లఖ్‌పతీ దీదీ' వంటి పథకాలతో పాటు, చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి అధినియమ్' ఒక గేమ్ ఛేంజర్ కాబోతోందని అభిప్రాయపడ్డారు. దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూ, "ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని దాదాపు అంతమొందించారు.

మోదీకి చంద్రబాబు, లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం సోషల్ మీడియా వేదికగా వారు తమ సందేశాలను పంచుకున్నారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, సుదీర్ఘకాలం సేవలందిస్తున్న ప్రధానిగా మీ నాయకత్వం చరిత్రాత్మకం. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా సుమారు 25 ఏళ్ల మీ ఆదర్శప్రాయమైన ప్రజాసేవ భారత ప్రగతి ప్రస్థానానికి నూతనోత్తేజాన్ని అందించింది. 'సేవ, సంకల్ప్, సుశాసన్' అనే మీ దార్శనికత 140 కోట్ల మంది భారతీయులకు స్ఫూర్తినిస్తోంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. దేశసేవలో ప్రధాని మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని, ఆయనకు శ్రీ వేంకటేశ్వరస్వామి సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. నారా లోకేశ్ సైతం ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ.. "సాధారణ నేపథ్యం నుంచి ఎదిగి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహిస్తున్న మీ ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం. మీలోని అపారమైన శక్తి, క్రమశిక్షణ, దేశాభివృద్ధి పట్ల మీకున్న అచంచలమైన నిబద్ధత ప్రజాక్షేత్రంలో ఉన్న మా వంటి లక్షలాది మందికి ఆదర్శంగా నిలుస్తున్నాయి" అని కొనియాడారు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో నిర్వహించనున్న 'సేవా సంకల్ప్' వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

అమరుల త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించుకున్నాం

(మొదటి పేజీ తరువాయి)

వినిపించిన నేల తెలంగాణ అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని గుర్తుచేశారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందన్నారు. సమ్మక్క--సారలమ్మల పోరాటం నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, అలాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం అని కితాబిచ్చారు. ఆ సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. 'భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. కానీ అప్పటి హైదరాబాద్ రాష్ట్రం నిజాం పాలనలోనే కొనసాగింది. నిజాం పాలనలో హైదరాబాద్ పారిశ్రామిక, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో పురోగతి సాధించింది. నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచస్థాయి గుర్తింపును అందుకుంది. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణిచివేత తీవ్రంగా ఉండేది. చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోలపరిచాయి. భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది. రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, అనభేరి ప్రభాకర్‌రావు, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు పోరాటాలకు నాయకత్వం వహించారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్షలు, ఉద్యమాలు, పోరాటాల నేపథ్యంలో ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో ఆపరేషన్ పోలో సైనిక చర్య చేపట్టారు. ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. అది నిజాం పాలకుల అధికారం ముగిసిన రోజు మాత్రమే కాదు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం 'ప్రజా పాలన దినోత్సవం'గా జరుపుకుంటున్నాం'అని రేవంత్ రెడ్డి వివరించారు. ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. 'అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్‌లో 2,000 పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపించాం. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించాం. హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రారంభించాం. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తాం'అని తెలిపారు. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తామని సీఎం తెలిపారు. 'ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది.

ప్రజలకు అందుబాటులో పారదర్శక పాలన అందించడమే లక్ష్యం

- ప్రజా పాలన దినోత్సవంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం
- జాతీయ జెండా ఆవిష్కరణ.. పోలీసుల గౌరవ వందనం స్వీకరణ

తొలివెలుగు, నిర్మల్ : ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే పారదర్శక పరిపాలన అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వేముల వీరేశం మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల నుంచి వచ్చే సమస్యలు, విజ్ఞప్తులపై అధికారులు సానుకూలంగా స్పందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను ముందుకు తీసుకెళ్లాలని వేముల వీరేశం కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అమరుల త్యాగంతోనే తెలంగాణ విమోచనం

- నిజాం నిరంకుశ పాలనపై ఉద్యమకారుల పోరాటం వీరోచితం
- పోచంపల్లిలో జాతీయ జెండా ఆవిష్కరించిన జింకల యాదగిరి

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : ఎందరో అమరుల ప్రాణ త్యాగాల ఫలితంగానే నిరంకుశ నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు జింకల యాదగిరి అన్నారు. పురపాలక కేంద్రంలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిదశ ఉద్యమంలో రజాకార్లు సృష్టించిన రక్తపాతాన్ని ఎదిరించి ఎంతోమంది వీరులుగా నిలిచారన్నారు. తెలంగాణ విమోచనానికి కృషి చేసిన పోరాట యోధుల ఆశయాలు, స్ఫూర్తిని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు పోనమోని శ్రీశైలం, చిలువేరు బాల నరసింహ, బైరు రామాంజనేయులు గౌడ్, సింగనబోయిన సత్యనారాయణ, చింతల రామకృష్ణ, చింతకింది కిరణ్, తంతరపల్లి వెంకటేష్, సీత పాండు, సీత శ్రవణ్, కలుకూరి శ్రీకాంత్, తండా శ్రీశైలం, మెరుగు శశికళ, ముసునూరు యాదగిరి, రావుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లిలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

- తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ
- పటేల్ తెగువ స్ఫూర్తితో నిజాం నిరంకుశత్వానికి విముక్తి: తడక వెంకటేశ్వర్లు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మండలం, పట్టణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపించిన తెగువ, స్ఫూర్తితో నిజాం నిరంకుశ నవాబు తలవంచి హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేసిన రోజును తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ కుమార్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ కొయ్యడ రజని శ్రీనివాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భరత లవ కుమార్, కౌన్సిలర్లు భాస్కర్ లింగస్వామి యాదవ్, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్య వేణు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగూరి పాండు, సీనియర్ అసిస్టెంట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌లో క్రిష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

- జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన తస్లీం ఖానం, శ్రీకారుణ్య
- విజేతలను అభినందించిన పాఠశాల యాజమాన్యం

తొలివెలుగు, రామన్నపేట : భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన నేషనల్ సైన్స్ సెమినార్‌లో రామన్నపేట క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని బీచ్ మహల్ హైస్కూల్‌లో "ఇండియన్ ఎనర్జీ బాస్కెట్-2047" అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో స్కూల్‌కు చెందిన విద్యార్థినులు తస్లీం ఖానం, ఎస్. శ్రీకారుణ్యలు అద్భుతమైన వీడియో ప్రదర్శనతో పాటు అంశంపై సమగ్ర విశ్లేషణను అందించి ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన గైడ్ టీచర్ మురళితో పాటు ప్రతిభ చాటిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె.వి.ఎన్.ఎస్. మణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

- కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు
- భక్తులకు పండ్ల పంపిణీ చేసిన భాజపా శ్రేణులు

తొలివెలుగు, చిట్యాల : భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చిట్యాల పట్టణంలో భాజపా ఆధ్వర్యంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ కనకదుర్గ ఆలయంలో భాజపా నాయకులు ప్రధాని మోదీ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులు, ప్రజలకు భాజపా నాయకులు పండ్లను పంపిణీ చేశారు. ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో దేశానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాజపా పట్టణ కార్యదర్శి సుంచు శ్రీను, రాష్ట్ర నాయకులు చికిలంమెట్ల అశోక్, మాస శ్రీనివాస్, జిల్లా నాయకులు కూరెళ్ల శ్రీను, పల్లె వెంకన్నగౌడ్, జయారపు రామకృష్ణ, గంజి గోవర్ధన్, గోశిక వెంకటేశం, కంచర్ల శంకర్‌రెడ్డి, పాల రవివర్మ, భాగమ్మ, శేఖర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో 'ప్రజాపాలన' వేడుకలు

- తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ
- పలు గ్రామాల్లో ఘనంగా ముువ్వెన్నెల పండుగ

తొలివెలుగు, చిట్యాల : మండలంలోని గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిట్యాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మాౖరెనేని విజయ్‌కుమార్, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతారమేష్ జాతీయ జెండాను ఎగురవేశారు. సుంకెనపల్లి, బోయగుబ్బ, చిన్నకాపర్తి గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచులు ఆవుల సునీత-యాదయ్య, రేగులగడ్డ స్వామిగౌడ్, ఆవుల సుందర్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దినోత్సవ ప్రాముఖ్యతను అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు గ్రామస్థులకు వివరించారు.

ఆత్మకూరులో హోటళ్లపై 'ఫుడ్ సేఫ్టీ' దాడులు

- 175 కిలోల పాడైపోయిన ఆహార పదార్థాలు ధ్వంసం
- ఫుడ్ లైసెన్సు లేకుండా నిర్వహిస్తున్న హోటల్ మూసివేత
- రెండు హోటళ్లకు నోటీసుల జారీకి సిఫారసు

తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) : ఫ్ఎస్ఎస్ఏఐ కమిషనర్ ఆదేశాల మేరకు హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తనిఖీల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్. శివశంకర్‌రెడ్డి గురువారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో పలు హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 175 కిలోల వినియోగానికి అనర్హమైన ఆహార పదార్థాలను గుర్తించి ధ్వంసం చేశారు. మండల కేంద్రంలోని ద్వారక హోటల్‌లో తనిఖీలు నిర్వహించగా సుమారు 25 కిలోల పాడైపోయిన ఆహార పదార్థాలను గుర్తించారు. వాటిని వినియోగానికి అనర్హమైనవిగా నిర్ధారించి ధ్వంసం

చేశారు. అలాగే అనుమానాస్పద రంగులు వినియోగిస్తున్నట్లు గుర్తించి, వాటికి సంబంధించిన ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. హోటల్‌లో గుర్తించిన లోపాలను సరిదిద్దుకోవాలని ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేయాలని అధికారులు సిఫారసు చేశారు. ప్రయోగశాల నుంచి వచ్చే పరీక్షా నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బాబా రామ్‌దేవ్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించగా ఫుడ్ లైసెన్సు లేకుండానే వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లైసెన్సును ప్రాంగణంలో ప్రదర్శించకపోవడంతోపాటు ఆహార పదార్థాలకు సరైన లేబుళ్లు లేకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, అపరిశుభ్రమైన పరిసరాల్లో ఆహార పదార్థాలను నిల్వ చేయడం వంటి లోపాలను గుర్తించారు. హోటల్‌లో పురుగులు పట్టిన ఆహార పదార్థాలతో పాటు కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్, నూనెలు, ఉల్లిపాయలు, చెకోడీలు, సమోసాలు, పకోడీలు తదితరాలను గుర్తించారు. సుమారు 150 కిలోల ఆహార పదార్థాలను వినియోగానికి అనర్హమైనవిగా గుర్తించి ధ్వంసం చేశారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా వాటిని డంపింగ్ యార్డుకు తరలించారు. హోటల్ పరిసరాల్లో డ్రైనేజీ లీకేజీ, దుర్వాసనతోపాటు ఈగలు, పందులు, కోతులు సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో తీవ్ర పారిశుధ్య లోపాలు ఉన్నట్లు నిర్ధారించారు. ఫుడ్ లైసెన్సు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నందున హోటల్‌ను మూసివేయించారు. లోపాలను పూర్తిగా సరిదిద్దుకోవడంతోపాటు ఫుడ్ లైసెన్సు పొందిన తర్వాతే తిరిగి వ్యాపారం ప్రారంభించాలని అధికారులు సూచించారు. ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేయాలని సిఫారసు చేశారు. తనిఖీల్లో అనుమానాస్పద వంట నూనె, బాస్మతి బియ్యం నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. పరీక్షల నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్. శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఆహార వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ నిబంధనలు, పరిశుభ్రత, పారిశుధ్య ప్రమాణాలను పాటించాలని అధికారి సూచించారు. వినియోగదారుల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా నాణ్యత లేని లేదా పాడైన ఆహార పదార్థాలను విక్రయిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాడి రైతులకు 'విజయ' చేయూత

- రాజాపేటలో త్వరలో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ ఏర్పాటు
- తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా పాడి రైతులకు రుణాల సదుపాయం
- గ్రామాల వారీగా రిజిస్టర్డ్ సొసైటీల ద్వారా పాల సేకరణ



తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలంలోని పాడి రైతులకు అండగా నిలిచేందుకు త్వరలో విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ తెలిపారు. గురువారం రాజాపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, గ్రామీణ యువత పాడి పరిశ్రమ వైపు దృష్టి సారించి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమ ద్వారా కుటుంబాలకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో పాడి రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రదీప్ తెలిపారు. పాడి రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రాజాపేట మండల కేంద్రంలో త్వరలో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎంసీయూ) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రిజిస్టర్డ్ పాల సేకరణ సొసైటీల ద్వారా పాలను సేకరించి, బీఎంసీయూ కేంద్రంలో శీతలీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రతి గ్రామానికి ఒక రిజిస్టర్డ్ సొసైటీకి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. పాడి రైతులు ప్రైవేటు డెయిరీలపై ఆధారపడి నష్టపోకుండా ప్రభుత్వ రంగానికి చెందిన విజయ డెయిరీకి నాణ్యమైన పాలను అందించాలని ప్రదీప్ సూచించారు. నాణ్యమైన పాలను సేకరణ కేంద్రాలకు అందించడం ద్వారా రైతులకు మెరుగైన ధర, స్థిరమైన మార్కెట్ లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. పాడి రైతులు అందుబాటులోకి వచ్చే ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు.

సెటిల్మెంట్లకు అడ్డాగా మున్సిపల్ కార్యాలయం?

- మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సెటిల్మెంట్ల దందా?
- 'ఇచట అన్ని రకాల సెటిల్మెంట్లు చేయబడును' అన్నట్లుగా వ్యవహారాలు?
- ముగ్గురు పట్టణ ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోనే దందా సాగుతోందని ఆరోపణలు
- కొత్తగా ఇళ్లు నిర్మించేవారే టార్గెట్.. పర్మిషన్ల పేరుతో వేధింపులంటూ ఫిర్యాదులు
- రియల్ ఎస్టేట్ క్రయవిక్రయాల పంచాయతీలు.. సెటిల్మెంట్లకు మున్సిపల్ కార్యాలయమే వేదిక?
- అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ప్రజల విజ్ఞప్తి

తొలివెలుగు, చౌటుప్పల్ : ప్రజలకు మౌలిక వసతులు, మున్సిపల్ సేవలు అందించాల్సిన కార్యాలయం.. వివాదాల పరిష్కారానికి వేదికగా మారుతోందా? లేక సెటిల్మెంట్లకు అడ్డాగా మారిందా? అనే ప్రశ్నలు చౌటుప్పల్ పట్టణంలో వినిపిస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని వివిధ రకాల సెటిల్మెంట్ల వ్యవహారాలు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

'ఇచట అన్ని రకాల సెటిల్మెంట్లు'?

ఇళ్ల నిర్మాణ అనుమతులు, నిర్మాణ నిబంధనలు, ఆస్తులకు సంబంధించిన వివాదాలు తదితర అంశాల్లో కొందరు వ్యక్తులు జోక్యం చేసుకుంటూ పంచాయతీలు, సెటిల్మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాల్సిన చోట మధ్యవర్తిత్వం పేరుతో వ్యవహారాలు నడుస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తగా ఇళ్లు కట్టేవారే టార్గెట్?

పట్టణంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకునే సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలే లక్ష్యంగా కొందరు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్మిషన్లు, నిర్మాణ నిబంధనలు, ఇతర అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురిచేసి చివరకు సెటిల్మెంట్ చేసేందుకు ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై మున్సిపల్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రియల్ ఎస్టేట్ పంచాయతీలకు వేదిక?

రియల్ ఎస్టేట్ క్రయవిక్రయాలకు సంబంధించిన వివాదాలు, భూ లావాదేవీల్లో తలెత్తుతున్న సమస్యలు, వ్యక్తుల మధ్య ఆస్తి వివాదాల్లోనూ కొందరు జోక్యం చేసుకుని పంచాయతీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయ పరిధికి సంబంధం లేని అంశాల్లోనూ ఇలాంటి వ్యవహారాలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముగ్గురు ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలోనేనా?

ఈ మొత్తం వ్యవహారం వెనుక ముగ్గురు పట్టణ ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ ఉందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. వారి అనుచరులు, మధ్యవర్తుల ద్వారా వివాదాలను సెటిల్మెంట్ చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత ప్రజాప్రతినిధుల అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఆరోపణలు నిజమా? కాదా? అన్నది అధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది.

ప్రజా ప్రభుత్వంలో అక్రమాలకు అండ ఉందా?

ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాల్సిన ప్రభుత్వ వ్యవస్థల్లోనే ఇలాంటి ఆరోపణలు రావడం పట్ల పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే ప్రతి వ్యవహారం నిబంధనల ప్రకారం, పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి:

మున్సిపల్ కార్యాలయంలో పర్మిషన్లు, నిర్మాణ అనుమతులు, రియల్ ఎస్టేట్ వివాదాల పేరుతో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న వ్యవహారాలపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయంలోని సీసీ కెమెరా దృశ్యాలు, ఫైళ్ల పరిశీలన, ఫిర్యాదుల వివరాలు, సంబంధిత అధికారుల విధులు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

ఎమ్మెల్యే పట్టించుకోవాలని ప్రజల వేడుకోలు:

చౌటుప్పల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఎలాంటి అక్రమ వ్యవహారాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో సెటిల్మెంట్ల ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించి, తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వేడుకగా 'ప్రజాపాలన దినోత్సవం'

- కలెక్టరేట్‌లో ఘనంగా వేడుకలు.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గుత్తా సుఖేందర్‌రెడ్డి
- ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారించాలి
- 28 మంది విద్యార్థులు, 8 మంది ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలు

తొలివెలుగు, భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ తల్లి, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమై 78 ఏళ్లు పూర్తిచేసుకుని 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 1944లో భువనగిరిలో నిర్వహించిన 11వ ఆంధ్ర మహాసభ జాతీయోద్యమ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ఆయన వివరించారు. జిల్లాలో నీటి ఎద్దడి నివారణతో పాటు రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించే దిశగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.

కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 28 మంది విద్యార్థులను, జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన 8 మంది ఉద్యోగులను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భాస్కర్‌రావు, ఎస్పీ అక్షాంష్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన, తెలంగాణ విమోచన వేడుకలు

- తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, పీఏసీఎస్ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ
- భాజపా ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలవ్యాప్తంగా గురువారం ప్రజాపాలన, తెలంగాణ విమోచన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అధికారికంగా నిర్వహించగా.. భాజపా ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ గోలి రవికిరణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై తక్కియుద్దీన్, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ సమీల మహేందర్‌గౌడ్ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు, అధికారులు ప్రజాపాలన, తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బరెని నవీన్‌కుమార్, రావుల హరిబాబు తదితరులతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో కోలాహలంగా లడ్డూ వేలం

- రూ.35 వేలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న దేవులపల్లి వీరేందర్
- వేడుకగా బ్రదర్స్ యూత్ గణేష్ ఉత్సవాలు

తొలివెలుగు, వనస్థలిపురం : వనస్థలిపురంలోని బ్రదర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం గణనాథుడి లడ్డూ వేలం పాటను ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో వేలం పాట సందడిగా సాగింది. లడ్డూ ప్రసాదం కోసం నిర్వహించిన వేలంలో దేవులపల్లి వీరేందర్ రూ.35 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు వీరేందర్‌ను అభినందించారు. గణేష్ నవరాత్రి వేడుకల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం భక్తుల్లో ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలు

- రామసేన యూత్ ఆధ్వర్యంలో 3 వేల మందికి మహా అన్నదానం
- ఈ నెల 21న స్వామివారి లడ్డూ వేలం పాట

తొలివెలుగు, వనస్థలిపురం : వనస్థలిపురంలోని ఎన్జీవోస్ కాలనీ, సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో రామసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గత 16 ఏళ్లుగా నిరంతరాయంగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 3 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న స్వామివారి లడ్డూ వేలం పాట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేలం పాటను విజయవంతం చేయాలని కోరారు. రామసేన యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రాజు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సంఘం సభ్యులు నరేష్, ఆంజనేయులు, రమేష్, ప్రభాత్, చంటి, తులసి, ఖాజా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయిలో దేశానికి గుర్తింపు తెచ్చిన నరేంద్ర మోదీ

సెప్టెంబర్ 17: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 దీపాలను వెలిగించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'దేశం ముందు.. ప్రజాసేవే పరమావధి' అనే స్ఫూర్తితో వికసిత్ భారత్--2047 లక్ష్యంగా మోదీ కొనసాగిస్తున్న సేవా ప్రస్థానం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో భారతదేశానికి గుర్తింపు తీసుకురావడంలో మోదీ నాయకత్వం కీలకంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మోదీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆపదలో ఉన్న బాధిత కుటుంబానికి అండగా మంత్రి కందుల దుర్గేష్

పెరవలి : తీవ్ర గాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తీపర్రు గ్రామానికి చెందిన యువకుడికి తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కర్రి విశ్వంత్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం నుండి రూ.3,08,521 ఆర్థిక సహాయాన్ని మంత్రి కందుల దుర్గేష్ మంజూరు చేయించారు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో విశ్వంత్‌ను రెయిన్‌బో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వైద్య చికిత్సకు భారీగా ఖర్చు అవుతున్న నేపథ్యంలో విశ్వంత్ తండ్రి కర్రి మణికంఠకు అండగా నిలిచిన గ్రామ నాయకులు ఆయనను వెంట తీసుకుని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను కలిసి పరిస్థితిని వివరించి, వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మంత్రి కందుల దుర్గేష్ వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాజ మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రక్రియ వేగవంతం కాగా ప్రభుత్వం నుంచి రూ.3,08,521విలువైన వైద్య సహాయం అందింది. తన పుట్టినరోజు సందర్భంగా కూడా ప్రజా సేవకే ప్రాధాన్యత ఇస్తూ ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ సహాయం అందేలా మంత్రి కందుల దుర్గేష్ చొరవ చూపడం పట్ల బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో స్పందించడం ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తూ మంత్రి కందుల దుర్గేష్ ముందుకు సాగుతున్నారని స్థానికులు పేర్కొన్నారు.

కౌశలం కార్యక్రమం ద్వారా యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు

అర్హత సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం, సెప్టెంబర్ 17: జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో గురువారం కౌశలం కార్యక్రమంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగమేళాలో ప్రైవేట్ సంస్థ ఎం ఎస్ ఎన్ లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు ఇంటర్వ్యూస్ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూకు 200 మంది పైగా హాజరు కాగా 6 మంది ఉద్యోగులు గా ఎంపిక సాధించడం జరిగిందన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కౌశలం కార్యక్రమం ద్వారా వివిధ సంస్థలతో సమన్వయం చేసుకుని ప్లేస్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా అందుబాటులోకి వచ్చే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగం లభించిన తరువాత పని ప్రదేశం దూరంగా ఉందనే కారణంతో అవకాశాన్ని వదులుకోవద్దని కలెక్టర్ సూచించారు. కెరీర్ ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు, సవాళ్లు ఎదురైనప్పటికీ వాటిని అధిగమిస్తూ పని పట్ల అంకితభావంతో ముందుకు సాగాలని అన్నారు. అనుభవం, నైపుణ్యం పెరిగే కొద్దీ మంచి అవకాశాలు, మెరుగైన వేతనం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత తమ వృత్తి జీవితంలో క్రమశిక్షణ, నైపుణ్యం, సమయపాలనకు ప్రాధాన్యతనిస్తూ సంస్థలో మంచి పేరు సంపాదించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగంలో చేరి తమ భవిష్యత్తును బలోపేతం చేసుకోవడంతో పాటు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచి సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ప్లేస్‌మెంట్ అవకాశాలను యువత విస్తృతంగా వినియోగించుకోవాలని ఆమె కోరారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా సంబంధిత శాఖలు, ప్రైవేట్ సంస్థలతో సమన్వయం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు అధికారి ఎ.వెంకటలక్ష్మి, డిస్టిక్ కో ఆర్డినేటర్ ప్రశాంత్ రెడ్డి,ఎం.ఎస్.ఎన్. లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సెంట్రల్ హెచ్ ఆర్ టి.చక్రపాణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తీపర్రు గ్రామంలో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

పెరవలి : గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని మరియు ఆయన ప్రజాసేవలో 25 సంవత్సరాల రాజకీయ ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని తీపర్రు గ్రామంలో భారతీయ జనతా పార్టీ మరియు కూటమి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ?ఈసందర్భంగా మోదీ ఆయురారోగ్యాలు దీర్ఘాయుష్షును కాంక్షిస్తూ దీపాలు వెలిగించి వేడుకలను దిగ్విజయంగా నిర్వహించారు. ?ఈకార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింహాద్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కరుటూరి సుబ్బారావు భోగవల్లి సత్యనారాయణ వాతాల వెంకటేశ్వర్లు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ?నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం మరింత ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ అందరికీ జన్మదిన శుభాకాంక్షలు.

మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గొప్ప మానవతావాది

వికార్ జనరల్ డాక్టర్ బాల ప్రొక్యూరేటర్ ఫాదర్ మైకేల్

ఏలూరు : రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని గొప్ప మానవతావాది అని పేదల అభివృద్ధి సంక్షేమం సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పరితపించే వారిని ఏలూరు పీఠం జనరల్ డాక్టర్ పి బాల ప్రొక్యూరేటర్ ఫాదర్ ఐ మైకేల్ అన్నారు. ఏలూరు నివాసంలో ఆళ్ల నాని భౌతికాయాన్ని ఫాదర్లు సందర్శించి పోలమాలలు వేసి నివాళులర్పించారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ రాజు వైఎస్ఆర్సిపి నేత జక్కుల బెనర్జీ ఉన్నారు

పోషక ఆహారమే ఆరోగ్యానికి రక్ష

పెరవలి: పోషక ఆహారమే ఆరోగ్యానికి రక్ష అని ప్రతి ఒక్కరూ పోషక ఆహారం తీసుకోవాలని మహిళలకు అంగన్వాడీ సిబ్బంది వివరించారు. గురువారం మండలంలో గల ఖండవల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రం నందు పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు బాలింతలు చిన్నారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అంగన్వాడీ సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అన్ని పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రతిరోజు ఆహారంగా తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని అర్హులైన వారందరూ తప్పనిసరిగా తీసుకుని ఉపయోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది సీతామహాలక్ష్మి కుమారి సావిత్రి పవిత్ర హెల్పర్లు మహిళలు పాల్గొన్నారు.

నిడదవోలు బీజేపీ సేవా సంకల్ప.

సెప్టెంబర్ 17: కార్యక్రమాలుసందర్భం: నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు (గుజరాత్ సీఎం మరియు భారత ప్రధానిగా).నిర్వహణ: రంగా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు.సుబ్బరాజుపేట: 70 మంది వృద్ధులకు బెడ్‌షీట్లు పంపిణీ.అంబేద్కర్ పాఠశాల (చర్చిపేట): 100 మంది పిల్లలకు పుస్తకాలు, డ్రైఫ్రూట్స్.. స్కూలుకు 20 కుర్చీలు.ఆర్థిక సాయం: మంత్రి కందుల దుర్గేష్ పుట్టినరోజు సందర్భంగా 5 మంది వికలాంగులకు రూ.5,000 సహాయం.పాల్గొన్నవారు: గుడూరి ఆంజనేయ విజయ నరసింహ రాజు, దేవన వెంకట పాపారావు, అక్కిన గోపాలకృష్ణ, ముళ్లపూడి రమేష్, తోరం జయ శ్రీనివాస్, మొక్కరాల సుదీప్, గొన్నబత్తుల విజయకృష్ణ. భారత్ మాతాకీ జై!

ట్రంప్ మ్యాప్‌ల సంబరం!

హోర్మూజ్ జలసంధిని 'చాలా త్వరలోనే' అమెరికా భూభాగంగా మారుస్తానని గతవారం ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పుడు ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులకు తెగబడొచ్చని కొందరు అనుమానించారు. తీరా మంగళవారం ఆయన చేసిందల్లా 'అమెరికా కొత్త భూభాగం' అని రాసివున్న హోర్మూజ్ జలసంధి మ్యాప్‌ను విడుదల చేయటమే. దీంతో ఇరాన్ దౌత్యవేత్తలు ప్రతిదాడికి దిగారు. కాలిఫోర్నియాను ఇరాన్ భూభాగంగా చూపుతూ ఇరాన్ కాన్సులేట్ ఒక చిత్రపటాన్ని విడుదల చేసింది. వేరే దేశాల భూభాగాలు డిమాండ్ చేయటం, వాటిని అమెరికా భౌగోళిక చిత్రపటాల్లో భాగంగా చూపటం ట్రంప్‌కు కొత్తేం కాదు. రెండోసారి అధికారంలోకొచ్చిన వెంటనే గ్రీన్‌లాండ్‌పై ఆయన కన్నుపడింది. అలాగే కెనడాను అమెరికాలో విలీనం చేసుకుని 51వ రాష్ట్రంగా మారుస్తామనీ, పనామా కాల్వ ఇకపై తమదేననీ, గాజాను 'సొంతం' చేసుకుంటామనీ కూడా పలుమార్లు చెప్పారు. అందుకు సంబంధించి ఒక వీడియో రూపొందించి విడుదల చేశారు. వెనిజులా మ్యాప్‌లో అమెరికా జెండాను సూచించే రంగులు నింపారు. అలాగే ఇకపై గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా వ్యవహరించాలంటూ ఉత్తర్వులు జారీచేశారు. అట్లాంటిక్ మహాసముద్రంలోని ఈ ప్రాంతం మెక్సికోకు పశ్చిమ, దక్షిణ దిశల్లో, అమెరికాకు ఉత్తరంవైపు, క్యూబాకు ఆగ్నేయంవైపు ఉంది. పేరు మార్చినా ప్రాదేశిక జల పరిధులేమీ మారడంలేదు గనుక మెక్సికో, క్యూబాలు ఈ విషయంలో మౌనంగా ఉండిపోయాయి. ఇక పర్షియన్ గల్ఫ్ పేరును గల్ఫ్ ఆఫ్ అరేబియాగా మారుస్తామని తొలి ఏలుబడిలో 2017లో ప్రకటించారు. దాంతో అప్పటి ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ జాగ్రఫీ చదువుకోమని ట్రంప్‌కు సలహా ఇచ్చారు. నిరుడు మే నెలలో సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ పర్యటనకెళ్లే ముందు పేరు మార్పు ఉంటుందని ప్రకటించారు. అటు తర్వాత ఎందుకో దాని జోలికి పోలేదు. ఈ 'భౌగోళిక చిత్రపట దురాక్రమణల్ని' చూసి జనం కాలక్షేపానికి నవ్వుకోవచ్చు. ట్రంప్ ప్రదర్శిస్తున్న అమాయకత్వమో, అజ్ఞానమో చూసి జాలిపడే వారూ ఉండొచ్చు. కానీ అగ్ర రాజ్యాల చరిత్ర తెలిసినవారు దాన్నంత తేలిగ్గా వదిలేయరు. ఒక విశాల పాలస్తీనా భూభాగంలోకి కొన్ని దశాబ్దాల్లో భారీయెత్తున యూదుల్ని తరలించి, అక్కడ నరమేధాలకు పాల్పడి ఇజ్రాయెల్‌ను సృష్టించి, అందుకు ఐక్యరాజ్యసమితి ఆమోదాన్ని 'రాబట్టిన' చరిత్ర ఆ దేశాలది. కనుక ఇప్పుడు ఉబుసుపోక మాట్లాడే మాటల్లో వేరే అర్థాలు ఉండొచ్చన్న అనుమానాలు రావటం సహజం. రాజకీయావతారం ఎత్తి దాదాపు పదిహేనేళ్లవుతున్నా పూర్వాశ్రమంలో నిర్వహించిన రియలెస్టేట్ వ్యాపార ప్రభావంనుంచి ట్రంప్ బయటపడలేకపోతున్నారన్నది వాస్తవం. రియలెస్టేట్ యజమాని మాదిరే ఆయన భూదాహంతో అల్లాడిపోతున్నారు.

సోషల్ మీడియాపై రణభేరి!

సామాజిక మాధ్యమాలు వచ్చాక ప్రపంచ పరిణామాలన్నీ వెంటవెంటనే అందరికీ చేరుతున్నాయి. అవి భావవ్యక్తీకరణ విస్తృతిని పెంచి కోట్లాదిమందికి గొంతునిస్తు న్నాయి. ఇన్నాళ్లూ మౌనంగా, నిస్సహాయంగా వీక్షించినవారంతా నిక్కచ్చిగా, నిర్మొహ మాటంగా తమ అభిప్రాయాలు వినిపిస్తున్నారు. కానీ మంచితోపాటే చెడు కూడా ఇందులో కలగలిసివుంది. వాటి కారణంగా అనవసర వదంతులు వ్యాపించి ఎందరో అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మన దేశం వరకే తీసుకుంటే దొంగ లుగా ముద్రపడి కొన్నిచోట్ల, గోవుల్ని తరలిస్తున్నారని ఆరోపణలొచ్చి మరికొన్నిచోట్ల ఉన్మాద గుంపులు దాడులు చేసి హతమార్చిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. టీనేజర్లు, పిల్లల మనసుల్లో ఈ వేదికల దుష్ప్రభావం కూడా నానాటికీ పెరుగుతోంది. మానసిక ఒత్తిళ్లకూ, రుగ్మతలకూ అవి కారణమవుతున్నాయి. అమెరికా అప్పీళ్ల కోర్టులో మెటా, ఆల్ఫాబెట్, స్నాప్‌చాట్, టిక్‌టాక్ తదితర సంస్థలపై సోమవారం 3,000కు పైగా పిటిషన్లు దాఖలు కావటాన్ని ఈ నేపథ్యంలో చూడాలి. 'పబ్లిక్ న్యూసెన్స్' కింద దాదాపు 40 రాష్ట్రాలతోపాటు మున్సిపాలిటీలు, పాఠశాలలు, వ్యక్తులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. వాస్తవానికి మొన్న మార్చిలోనే లాస్ ఏంజెలెస్‌కి చెందిన న్యాయస్థానం సామాజిక మాధ్యమ వేదికల్ని యువతకు హానికరమైన రీతిలో రూపొందించటాన్ని తప్పుబట్టింది. చిన్న వయసులో ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లు తనను బానిసగా మార్చాయనీ, ఇందువల్ల తీవ్రంగా నష్టపోయాననీ ఆరోపిస్తూ కోర్టుకెక్కిన 20 యేళ్ల యువతికి 60 లక్షల డాలర్ల పరిహారం చెల్లించాలని ఆ న్యాయస్థానం తీర్పునిచ్చింది. న్యూమెక్సికోలో సైతం మెటాపై ఈ తరహా తీర్పే వెలువడింది. వేదికకు సంబంధించిన భద్రత విషయంలో వినియోగదారుల్ని అది తప్పుదోవ పట్టించిందని న్యాయస్థానం నిర్ధారించింది. 37.5 కోట్ల డాలర్ల పరిహారం చెల్లించాలని సంస్థను ఆదేశించింది. చాన్నాళ్లక్రితమే టీనేజర్లపైనా, పిల్లలపైనా సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం ఎలా ఉన్నదో ప్రభుత్వాలు గుర్తించాయి. ఆస్ట్రేలియా పదహారేళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల ప్రవేశాన్ని నిషేధించింది. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకునే బాధ్యతను టెక్ సంస్థలపైనే పెట్టింది. దీన్ని పాటించనట్టయితే దాదాపు 5 కోట్ల ఆస్ట్రేలియా డాలర్లు జరిమానా చెల్లించాలని చట్టం నిర్దేశించింది. బ్రిటన్, ఫ్రాన్స్ సైతం ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. యూరోపియన్ యూనియన్(ఈయూ) హానికర మైన పోస్టుల్ని తొలగించటంలో జాప్యం జరిగితే గ్లోబల్ టర్నోవర్‌లో 6 శాతం మొత్తాన్ని జరిమానా విధించే చట్టం తీసుకొచ్చింది. తెలిసో తెలియకో ఏదైనా వీడియో చూస్తే ఆ వెనువెంటనే అటువంటివే కుప్పలు తెప్పలుగా వచ్చిపడేలా ఆ మాధ్యమాలు అల్గారిథమ్‌లు రూపొందిస్తున్నాయి. తెలిసీ తెలియని వయసులో ఉన్న పిల్లల్ని వ్యామోహాల బారిన పడేస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలొచ్చినప్పుడల్లా ఈ మాధ్యమాలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తాము కేవలం ఒక వేదిక మాత్రమే కల్పిస్తున్నామనీ, అందులో వేరెవరో ఉంచే కంటెంట్‌కు తామెలా బాధ్యులమనీ ప్రశ్నిస్తున్నాయి. ఏటా వేలాదికోట్ల డాలర్ల లాభాలు ఆర్జించే ఉద్దేశంతోనే ఈ సంస్థలు జుగుప్సాకర, హింసాత్మక అంశాలున్న వీడియోల్ని చూసీ చూడనట్టు వదిలేస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు భావప్రకటనా స్వేచ్ఛకు అనువైనవి. కానీ అవి దుర్వినియోగమైన పక్షంలో కఠినచర్యలుండాలి. మన దేశం ఈ విషయంలో వెనకబడే ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగానో, పాలకుల్ని కించపరిచేవిధంగానో పోస్టులున్నప్పుడే తక్షణ స్పందన కనిపిస్తోంది. తెలంగాణలో ఆన్‌లైన్ చానెళ్లు నిర్వహిస్తున్న మహిళా పాత్రికేయులపై అత్యంత జుగుప్సాకరంగా పోస్టులు పెడుతున్నవారిపై చర్యలు లేవు.

బ్రెజిల్‌పై అమెరికా పడగ!

లాటిన్ అమెరికా దేశాల్లో నియంతలను గద్దెనెక్కించిన గతకాలపు పోకడలకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు. వచ్చే అక్టోబర్ మొదటివారం బ్రెజిల్‌లో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత దేశాధ్యక్షుడు, మధ్యేవాద వామపక్ష నేత లూలా డి సిల్వాను ఓడించి మితవాద పక్ష నాయకుడు ఫ్లేవియో బోల్సోనారో అధికారంలోకి రాలేనట్టయితే సైనిక జోక్యం చేసుకోవటానికి పథక రచన చేస్తున్నారు. ఇందులో భాగంగా రెండు నేరస్త ముఠాలు సీవీ, పీసీసీలను ఉగ్రవాద సంస్థలుగా అమెరికా ప్రకటించింది. వీరినుంచి అమెరికాకు ఏర్పడిన ముప్పును తొలగించటంలో బ్రెజిల్ విఫలమైందన్న సాకుతో సైనిక దాడి చేయటమే ఈ పథకం ఆంతర్యం. వెనిజులాలో సైతం నిరుడు ట్రంప్ ఇదే తరహా డ్రామా నడిపించారు. మాదకద్రవ్య ముఠాలు అమెరికా భద్రతకు ముప్పుగా మారాయనీ, వాటిని అధ్యక్షుడు మదురో ప్రోత్సహిస్తున్నారనీ ఆరోపించారు. ఈ ఏడాది జనవరిలో మదురో దంపతుల్ని కిడ్నాప్ చేసి అమెరికాకు తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ అమెరికా కోర్టులో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. లాటిన్ అమెరికా దేశాలన్నిటా 1964 మొదలుకొని రెండు దశాబ్దాలపాటు అమెరికా ఇలాంటి దుర్మార్గాలకే పాల్పడింది. ఇదే బ్రెజిల్‌లో 1964లో వామపక్ష ప్రభుత్వాధినేత జివావో గౌలార్ట్‌ను సైనిక కుట్రలో తొలగించి హుంబెర్టో కాస్టిలోను గద్దెనెక్కించింది. అదే సంవత్సరం బొలీవియాపై సైతం ఇదే కుట్ర కొనసాగించింది. చిలీలో 1973లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సోషలిస్టు నాయకుడు సాల్వెడార్ అలెండీని సైనిక తిరుగుబాటులో హతమార్చి అగస్టో పినోచెట్‌ను అధినేతగా కూర్చోబెట్టింది. ఇలా ఉరుగ్వే, అర్జెంటీనా, ఎల్ సాల్వెడార్, గ్వాటెమాలా దేశాల్లో సైతం 1985 వరకూ ఈ కుట్రలు సాగుతూనే వచ్చాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో తన పొరుగున ఆనాటి సోవియట్ ప్రభావం పడితే తన ప్రాభవం కొడిగడుతుందన్న భయాందోళనలే ఈ కుట్రలకు కారణం. నియంతల రాకతో లాటిన్ అమెరికా దేశాల ప్రజానీకం భయానక పాలన చవిచూశారు. ఒక్క అర్జెంటీనాలోనే 'డర్టీ వార్' పేరుతో పదివేలమంది ప్రాణాలు తీశారు. చిలీలో, ఎల్‌సాల్వెడార్‌లో, గ్వాటెమాలాలో సాగించిన నరమేధాలు దాదాపు యాభైవేలమంది ఉసురుతీశాయి. మళ్లీ ఇన్నాళ్లకు అమెరికా అస్తిత్వ ఆందోళనలో పడింది. మొన్న మే నెలలో జరిగిన కొలంబియా ఎన్నికల్లో ట్రంప్ తెరవెనక సాగించిన కుట్రల ఫలితంగా ఆయన అనుకూలుడు ఎబెలార్డో ఎస్ప్రియెల్లా స్వల్ప ఆధిక్యతతో అధికారంలోకొచ్చారు. అందుకే బ్రెజిల్‌లో సైతం ఆ పాచిక పారుతుందనుకుంటున్నారు. లూలా బ్రిక్స్ కూటమిలో చురుగ్గా పాలుపంచుకోవటం, చైనాతో సాన్నిహిత్యం పెంచుకోవటం, అమెరికా డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకోవటం ట్రంప్‌కు కంటగింపుగా మారాయి. తన కీలుబొమ్మ జైర్ బోల్సోనారో 2023 ఎన్నికల్లో పదవీభ్రష్టుడు కావటంనుంచే ట్రంప్ బుసలుకొడుతున్నారు. తిరుగుబాటు కుట్రలో బోల్సోనారోను శిక్షిస్తే తీవ్ర పరిణామాలుంటాయని న్యాయవ్యవస్థను సైతం హెచ్చరించారు. కానీ ఈ ఏడాది మొదట్లో బోల్సోనారోకు 27 యేళ్ల ఖైదు పడింది. ప్రస్తుతం డి సిల్వాతో తలపడేందుకు రంగంలో 13 మంది అభ్యర్థులున్నారు. ఆయనకు 40 శాతం మద్దతుంటే, సమీప ప్రత్యర్థి ఫ్లేవియో 28 శాతంవద్ద ఆగిపోయారు. దీన్నెలాగైనా తారుమారు చేయటానికి అమెరికా పడరాని పాట్లు పడుతోంది. బ్రెజిల్ పాత్రికేయులకూ, వివిధ మాధ్యమాల్లో ప్రభావం చూపగల వారికీ ఉదారంగా వీసాలు మంజూరుచేసి 'భావప్రకటనా స్వేచ్ఛ'పై పాఠాలు చెబుతోంది. తప్పుడు ప్రచారాలు సాగిస్తోంది. అయినా పరిస్థితి ఆశాజనకంగా లేకపోవటంతో కొత్త ఎత్తుకు తెరలేపింది. ఇరాన్‌లో ఓటమి ఎదురుకావటం, ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినటం, డాలర్ మనుగడకు ముప్పు ఏర్పడటం ట్రంప్‌ను వేధిస్తున్నాయి. ఇప్పటికే పెరూ, ఎల్‌సాల్వెడార్ దేశాల్లో మితవాదులు గెలిచారు. బ్రెజిల్‌ను సైతం లోబరుచుకోగలిగితే దేశంలో తన కీర్తిప్రతిష్ఠలు పెరుగుతాయని ట్రంప్ భావిస్తున్నారు. పొరుగు దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటంలాంటి అనాగరిక పోకడలకు అమెరికా ఇకనైనా స్వస్తిచెప్పాలి.

అమెరికా పర్యటన రద్దు అందుకేనా!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రచారం చేసుకున్న తెలంగాణ రైజింగ్ విదేశీ యాత్రలో భాగంగా అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం చర్చకు దారితీసింది. కేంద్రం రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించలేదని, సీఎం ప్రతిపాదించిన అమెరికా పర్యటన కార్యక్రమం ఆయన పదవికి, పర్యటన ఉద్దేశానికి తగిన విధంగా లేదని విదేశాంగశాఖ స్పష్టం చేయడం రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన అవగాహనా లోపానికి నిదర్శనం. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రం నిర్ణయంలో రాజకీయ కోణం ఉన్నదని ఆరోపిస్తున్నది. ఈ నేపథ్యంలో అసలు లోపం ఎక్కడుంది? కేంద్రంలోనా, రాష్ట్ర ప్రభుత్వ పర్యటన ప్రణాళికలోనా అనేదే ఇప్పుడు ప్రశ్న. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటన సాధారణ వ్యక్తిగత పర్యటన కాదు. ఆ యన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతినిధి. అందువల్ల ఎవరిని కలుస్తారు? ఎందుకు కలుస్తారు? ఆ సమావేశాల వల్ల రాష్ట్రానికి, దేశానికి ఏం ప్రయోజనం? ఎంత పెట్టుబడి వచ్చే అవకాశం ఉన్న ది? ఎన్ని ఉద్యోగాలు సృష్టించగలరు? ఏ సాంకేతికత లేదా విద్యా భాగస్వామ్యాలు ఏర్పడుతా యి? గతంలో కుదుర్చుకున్న ఎంవోయూ లో ఎ న్ని అమలయ్యాయి? వంటి అంశాలతో స్పష్టమై న ప్రణాళిక ఉండాలి. ప్రభుత్వ ఖర్చుతో విదేశాలకు వెళ్లి, కొందరు ప్రతినిధులను కలువడం, ఫొ టోలు దిగడం, కొన్ని ఒప్పందాలు చేసుకోవడం మాత్రమే పర్యటన విజయానికి ప్రమాణం కాదు. తెలంగాణ రైజింగ్ పేరుతో అమెరికాలో పెట్టుబడులు, పరిశ్రమలు, టెక్ సంస్థలను తెలంగాణకు ఆహ్వానించడమే ప్రధాన లక్ష్యమైతే, గత విదేశీ పర్యటనల ఫలితాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలి. దావోస్ వంటి అంతర్జాతీయ వేదికల్లో భారీ పెట్టుబడుల ప్రకటనలు, ఎంవోయూలు కుదుర్చుకోవడం సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. కానీ వాటిలో ఎన్ని వాస్తవ పెట్టుబడులుగా మారాయి? ఎన్ని పరిశ్రమలు క్షేత్రస్థాయిలో ఏర్పడ్డాయి? ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు ఉండా లి. ఎంవోయూ కుదరడం విజయానికి మొదటి అడుగు మాత్రమే. అది పరిశ్రమగా, పెట్టుబడిగా, ఉద్యోగంగా మారినప్పుడే ప్రభుత్వ పర్యటనకు నిజమైన ఫలితం వచ్చినట్టు భావించాలి. రేవంత్‌రెడ్డి లండన్ పర్యటన కూడా ఇదే కోణంలో పరిశీలించాల్సిన అంశం. ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో తెలంగాణకు విద్య, పరిశోధన భాగస్వామ్యాలు ఏర్పడాలని కోరుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. విదేశీ విశ్వవిద్యాలయాలు రాష్ట్రానికి రావడం, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఏర్పాటు కావడం విద్యార్థులకు ఉపయోగకరమని తెలిపింది. అయితే అదే సమయంలో తెలంగాణలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిస్థితిని కూడా ప్రభుత్వం సమీక్షించాలి. అధ్యాపకుల ఖాళీలు, పరిశోధన నిధులు, ప్రయోగశాలలు, హాస్టళ్లు, మౌలిక వసతులు వంటి సమస్యలపై విద్యార్థులు ఆందోళన చెందుతుంటే, ముందుగా మన విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రకటించిన నిధుల పరిస్థితి ఏమిటి? జిల్లాల్లోని విశ్వవిద్యాలయాలకు అవసరమైన నిధులు ఎందుకు అందడం లేదు? ఉన్నత విద్యా రంగంలో అధ్యాపకుల నియామకాలు, పరిశోధనలకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తున్నది? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించడం మాత్రమే విద్యా సంస్కరణగా భావించలేం. విదేశీ సంస్థలు రావాలి, అదే సమయంలో తెలంగాణ విద్యాసంస్థలను కూడా ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలి. ఈ వ్యవహారంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అమెరికా పర్యటన కూడా ప్రస్తావనకు వస్తున్నది. ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు కొన్ని రోజుల ముందు ఉప ముఖ్యమంత్రి దాదాపు రెండు వారాలు అమెరికాలో పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, పారిశ్రామికవేత్తలను కలువడం ప్రభుత్వ లక్ష్యమైతే, ఆ పర్యటనలోనే తెలంగాణ రైజింగ్ కోసం పెట్టుబడులను ఎందుకు సమీకరించలేదనే ప్రశ్న తలెత్తుతున్నది. ఇద్దరు ముఖ్య నాయకుల పర్యటనల మధ్య సమన్వయం ఎందుకు లేదు? ఎవరి బాధ్యత ఏమిటి? ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. దీనిని వ్యక్తిగత ప్రతిష్ట సమస్యగా కాకుండా పరిపాలనా సమన్వయ సమస్యగా చూడాలి. రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనల విషయంలో ప్రచారానికి, ఫలితానికి మధ్య తేడా ఉన్నది. పర్యటనకు ముందు భారీ పెట్టుబడుల ప్రకటనలు రావడం కంటే, పర్యటన తర్వాత వాటి అమలుపై ప్రజలకు నివేదిక ఇవ్వడం ముఖ్యం. సంస్థ పేరు, పెట్టుబడి మొత్తం, స్థాపించే ప్రదేశం, అమలు దశ, ఉద్యోగాల సంఖ్య వంటి వివరాలను ప్రభుత్వం ప్రజలకు అందించాలి. అప్పుడే తెలంగాణ రైజింగ్ ఎంతవరకు వాస్తవమో తెలుస్తుంది. రాష్ట్ర కాంగ్రెస్‌లోని అంతర్గత అసంతృప్తి నెలకొన్నది. మంత్రులు-ఎమ్మెల్యేల మధ్య మాట ల యుద్ధం ముదురుతున్నది. ప్రభుత్వ సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రభుత్వం లో సమన్వయం, సహకారం బలహీనంగా ఉన్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి విదేశీ పర్యటన వ్యవహారం ఆ విమర్శలకు మరింత బలం చేకూర్చింది. మొత్తానికి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడం కేవలం రాజకీయ వివాదం కాదు. పాలనా ప్రణాళిక, పారదర్శకత, పెట్టుబడుల ఫలితాలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు అనే నాలుగు కోణాల్లో చూడాల్సిన అంశం. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పర్యటన ప్రణాళికలోనే లోపాలున్నాయా? అనే ప్రశ్నకు పూర్తి సమాధానం, రాష్ట్ర ప్రభుత్వమే వెల్లడించాలి. దమరోవైపు కేంద్ర ప్రభుత్వ వర్గాల విశ్వసనీయ సమాచారం జాతీయ మీడియా పలు కథనాలు ఇస్తున్నది. రేవంత్ పర్యటన షెడ్యూల్‌లో న్యూయార్క్ మేయర్ జోరాన్ మమ్దానీతో భేటీ ఉన్నట్టు తెలుస్తున్నది. ఆయన గతంలో పీఎం మోదీకి వ్యతిరేకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే రేవంత్‌రెడ్డి పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించినట్టు కథనాలు వస్తున్నాయి.

ఏసీల ధరలకు రెక్కలు..

12 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించిన బ్లూస్టార్

హైదరాబాద్: ఎయిర్ కండిషనర్ల(ఏసీ) ధరలకు రెక్కలొచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కమోడిటీ ఉత్పత్తులు భగ్గుమనడంతో దేశవ్యాప్తంగా ఏసీ ధరలు భారీగా పెంచుతున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు 10 శాతం వరకు ధరలు పెంచుతున్నట్టు ప్రకటించగా.. తాజాగా ఈ జాబితాలోకి ప్రముఖ ఏసీల తయారీ సంస్థ బ్లూస్టార్ కూడా చేరింది. కంపెనీకి చెందిన ఏసీల ధరలను 12 శాతం వరకు పెంచుతున్నట్టు కంపెనీ గ్రూపు ప్రెసిడెంట్ మోహిత్ సుద్ తెలిపారు. రాగి, అల్యూమినియంతోపాటు నూతన విద్యుత్ నిబంధనలు అమలు చేయడంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఏసీల ధరలను పెంచాల్సి వస్తున్నదన్నారు. దీంతో ఫైవ్-స్టార్ ఏసీలు కనిష్ఠంగా 5 శాతం వరకు గరిష్ఠంగా 15 శాతం వరకు సవరించినట్టు చెప్పారు. జీఎస్టీని 10 శాతానికి తగ్గించడంతో ఏసీల ధరలు దిగొచ్చాయని, కానీ యుద్ధ ప్రభావంతో వీటి ధరలు 15 శాతం పెరగడంతో మొత్తంగా గతేడాదితో పోలిస్తే వీటి ధరలు 5 శాతం వరకు అధికమయ్యాయన్నారు.రాష్ట్ర మార్కెట్లోకి నూతన శ్రేణి రూమ్ 125 రకాల ఏసీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏసీల అమ్మకాలు 5 శాతం పడిపోయే అవకాశాలున్నాయని, ప్రధానంగా ధరలు పెరుగడం, వర్షాభావ పరిస్థితులు కూడా మరో కారణమన్నారు.

కోటక్ మహీంద్రాలో భారీ కుంభకోణం కలకలం

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో జరిగిన రూ. 590 కోట్ల భారీ కుంభకోణం మరువకముందేమరో బ్యాంకులో జరిగిన భారీ మోసం కలకలం రేపుతోంది. హర్యానాలో కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో రూ. 160 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఖీఐ) కుంభకోణం వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇక్కడ ఉన్నాయి హర్యానాలోని పంచకుల మునిసిపల్ కార్పొరేషన్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల విలువ దాదాపు రూ. 160 కోట్లు. అయితే, ఎఫ్‌డీల్లో జమ చేసిన నధులు అసలు డిపాజిట్టే కాలేదు. నకిలీ పత్రాలు సృష్టించి ఆ సొమ్మును ఇతర మోసపూరిత ఖాతాలకు మళ్లించారు. ఇందుకోసం హర్యానాకు చెందిన పంచకుల మున్సిపల్ కార్పొరేషన్‌కు నకిలీ పత్రాలను జారీ చేశారని అధికారులు గుర్తించారు. ఈ భారీ మోసంలో బ్యాంక్ ఉద్యోగులతో పాటు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల ప్రమేయం కూడా ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

వెలుగులోకి ఎలా వచ్చింది?

రూ. 58 కోట్ల విలువైన ఒక ఖీణ గడువు ముగిసిన తర్వాత, ఆ మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని కార్పొరేషన్ బ్యాంకును కోరినప్పుడు ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. బ్యాంకు స్టేట్‌మెంట్ ప్రకారం బదిలీ పూర్తయినట్లు చూపించినప్పటికీ, ఆ నిధులు కార్పొరేషన్ ఖాతాకు చేరలేదు. ఆరా తీస్తే ఆ బ్యాంక్ స్టేట్‌మెంట్ కూడా నకిలీదేనని నిర్ధారణ అయ్యింది.డబ్బు మాయమైపోయిందని తేలింది. ఈ వ్యవహారంలో బ్యాంకు జారీ చేసిన ఖీణలన్నీ నకిలీవని, ఖాతాలో అసలు నిధులే లేవని గుర్తించారు. నకిలీ పత్రాలను ఉపయోగించి బ్యాంకు ఉద్యోగులు చాలాకాలం పాటు ఈ నిధుల దుర్వినియోగాన్ని దాచిపెట్టారని ఆరోపణలు వెల్లువెత్తాయి.తమ ఎఫ్‌డీ నిధులను బదిలీ చేయమని బ్యాంకును కోరినప్పుడే ఈ వ్యవహారం బైటపడిందని, పంచకుల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కుమార్ తెలిపారు. ఇదే విషయాన్ని స్టేట్ విజిలెన్స్‌కు నివేదించారు. బ్యాంక్‌పై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడంతో పాటు, ఆ బ్యాంక్‌ను ప్రభుత్వ పనుల నుండి తొలగించాలని (ఎవ-వఎజుఖుఅవశ్రీ) హర్యానా ప్రభుత్వాన్ని కోరారు.

గ్యాస్ కొరతకు చెక్.. 20 శాతం పెరిగిన కేటాయింపు!

భారతదేశంలో వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల లభ్యతను మరింత బలపరచడానికి ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. ఇందులో భాగంగానే.. దేశవ్యాప్తంగా కమర్షియల్ సరఫరాను పెంచే నిర్ణయం తీసుకుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. అదనంగా 20% కమర్షియల్ సిలిండర్ల కేటాయింపును ఆమోదించింది. దీంతో మొత్తం కేటాయింపు సగటు నెలవారీ అవసరంలో 50%కి పెరిగింది. ఈ పెంపు వలన వాణిజ్య రంగాలకు గ్యాస్ సరఫరా మరింత స్థిరంగా, సమృద్ధిగా అందుబాటులో ఉంటుంది. ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సేవలు వంటి రంగాలు గ్యాస్ కొరత నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుంది. కాగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గ్యాస్ సిలిండర్లను సమయానికి, సులభంగా అందేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నిర్ణయం వల్ల వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను అంతరాయం లేకుండా కొనసాగించగలుగుతాయి. అంతేకాకుండా, వినియోగదారులకు ఆహారం, ఇతర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చేస్తుంది. గ్యాస్ కొరత కారణంగా ఎదురయ్యే సమస్యలు తగ్గుతాయి. ధరల స్థిరత్వం కూడా మెరుగుపడే అవకాశం ఉంది.

గల్ఫ్ ఉద్రిక్తతల ప్రభావం

రూపాయి, ద్రవ్యోల్బణ దెబ్బకు వడ్డీరేట్లు పైపైకి?

న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి (60 బేసిస్ పాయింట్లు) పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హొర్ముజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది.

4.6 శాతానికి ద్రవ్యోల్బణం!

ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయగలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హొర్ముజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం (ఏప్రిల్ 15) వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగదారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగుతుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది.

నెలకు అద్దె ఏ రూ.1.2 లక్షలు!

కలల నగరం ముంబైలో అద్దె కోసం ఇల్లు దొరకడం ఒక ఎత్తయితే, దాని అద్దె చెల్లించడం మరో ఎత్తు. సామాన్యుడి నెల జీతం కంటే కొన్ని ప్రదేశాల్లో ఇక్కడ అద్దెలే ఎక్కువగా ఉంటాయన్నది జీర్ణించుకోలేని వాస్తవం. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియో ముంబై జీవన ప్రమాణాలు, అద్దె భారం గురించి చర్చకు తెరలేపింది. ప్రముఖ వ్లాగర్ ఆర్య కొఠారి తన ఇన్‌స్టాగ్రామ్ సిరీస్ 'రెంట్ ఇన్ ముంబై - ఈపీ 4' లో భాగంగా అంధేరీ వెస్ట్ ప్రాంతంలో ఒక యువతిని ఇంటర్వ్యూ చేశారు. ఆ ప్రాంతంలో ఒక 3బీహెచ్‌కే (మూడు పడకగదుల) ఫ్లాట్ కోసం ఆమె నెలకు ఏకంగా రూ.1.2 లక్షలు అద్దె చెల్లిస్తున్నట్లు వెల్లడించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఆ విశాలమైన గది, ఆధునిక వంటగది చూస్తుంటే ముంబై వంటి నగరంలో అది ఎంత లగ్జరీనో అర్థమవుతుంది. ఈ వీడియోపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. 'ముంబైలో అద్దె కట్టడమే ఒక పూర్తిస్థాయి ఉద్యోగంలా మారిపోయింది' అని ఒక యూజర్ వ్యాఖ్యానించారు. 'ఒకరికి రూ. 1.2 లక్షల అద్దె సౌకర్యం కావచ్చు, మరొకరికి రూ.80 వేల జీతంతో బతకడమే పెద్ద పోరాటం కావచ్చు' అని మరికొరు అన్నారు.

జియో.. జెరోధా.. ?కొత్త మ్యూచువల్ ఫండ్‌లు

జెరోధా మ్యూచువల్ ఫండ్ నుంచి నిఫ్టీ మిడ్‌స్మాల్‌క్యాప్ 50:50 ఇండెక్స్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ 23న ప్రారంభం కానుంది. ఏప్రిల్ 6 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఇన్వెస్టర్లు రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ ఫండ్‌ను కేదార్‌నాథ్ మిరాజ్‌కార్ నిర్వహించనున్నారు. ఈ ఫండ్ అధిక రిస్క్ కిందకు వస్తుంది. నిఫ్టీ మిడ్‌స్మాల్‌క్యాప్ 400 50:50 ఇండెక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. కనుక సూచీ రాబడులే ఈ పథకం పనితీరుకు ప్రామాణికంగా ఉంటాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలో బలమైన వృద్ధి అవకాశాలున్న కంపెనీల్లో దీర్ఘకాలం పెట్టుబడుల ద్వారా మెరుగైన సంపద సృష్టించుకోవాలని భావించే ఇన్వెస్టర్లకు ఈ పథకం అనుకూలంగా ఉంటుంది.

జియో బ్లాక్‌రాక్ లార్జ్‌క్యాప్ ఫండ్

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా జియో బ్లాక్‌రాక్ లార్జ్‌క్యాప్ ఫండ్‌ను తీసుకొచ్చింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఈ నెల 24న ప్రారంభమై, ఏప్రిల్ 7న ముగుస్తుంది. లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడిని వృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశ్యం. బీఎస్ఈ 100 ఇండెక్స్ (టీఆర్ఐ) ఈ పథకం పనితీరుకు ప్రామాణికం. తన్వి కచేరియా, సాహిల్ చౌదరి ఈ పథకానికి మేనేజర్లుగా వ్యవహరించనున్నారు. డైరెక్ట్‌ప్లాన్ (మధ్యవర్తుల ప్రమేయం లేని), గ్రోత్ ఆప్షన్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. లార్జ్‌క్యాప్ కంపెనీల్లో 80--100 శాతం వరకు, 0--20 శాతం మేర ఇతర కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది.

30 రోజుల రీఛార్జ్ తప్పనిసరి!

మొబైల్ వినియోగదారుల ప్రయోజనాలే పరమావధిగా టెలికాం రంగంలో మార్పులకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాజ్యమేలుతున్న 28 రోజుల రీఛార్జ్ ప్లాన్ల స్థానంలో పూర్తి 30 రోజుల వ్యాలిడిటీ కలిగిన ప్లాన్లను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టెలికాం ఆపరేటర్లపై కేంద్రం ఒత్తిడి పెంచుతోంది. ఇటీవల రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా లేవనెత్తిన అంశాలపై కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సానుకూలంగా స్పందించారు. సాధారణంగా నెల అంటే 30 లేదా 31 రోజులు ఉంటుంది. కానీ, టెలికాం కంపెనీలు నెలవారీ ప్లాన్ పేరిట 28 రోజుల వ్యాలిడిటీనే ఇస్తున్నాయి. దీనివల్ల వినియోగదారుడు ఏడాదికి 12 సార్లు కాకుండా 13 సార్లు రీఛార్జ్ చేయాల్సి వస్తోందని రాఘవ్ చద్దా పార్లమెంటులో గళమెత్తారు. ఆయన లేవనెత్తిన అంశాలు కింది విధంగా ఉన్నాయి.

ఒకరోజుకు 2 జీబీ డేటా ఇస్తే వినియోగదారుడు 1.5 జీబీ మాత్రమే వాడితే మిగిలిన 0.5 జీబీ అర్ధరాత్రికి మాయమైపోతోంది.

ది వినియోగదారుడిని వంచించడమే. ఉపయోగించని డేటాను మరుసటి రోజుకు క్యారీ ఫార్వర్డ్ చేయాలి.

రీఛార్జ్ గడువు ముగిసిన వెంటనే ఇన్‌కమింగ్ కాల్స్ నిలిపివేయడం సరికాదు. కనీసం ఏడాది పాటు ఇన్‌కమింగ్ సదుపాయం ఉండాలి. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నిబంధనల ప్రకారం.. ప్రతి ఆపరేటర్ తమ ప్లాన్ల జాబితాలో కచ్చితంగా 30 రోజుల ప్లాన్‌ను చేర్చాలని మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. 'కంపెనీలు అందించే ప్లాన్ ఆప్షన్లలో కచ్చితంగా 30 రోజుల ప్లాన్ ఉండాలి. ఈ నిబంధనను కంపెనీలు పాటిస్తున్నప్పటికీ వాటిని వినియోగదారులకు తెలిసేలా మరింతగా మార్కెటింగ్ చేయాలని కోరుతున్నాం' అని జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు.

ట్రాయ్ నిబంధనలు ఏం చెబుతున్నాయి?

2022లోనే ట్రాయ్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ప్రతి టెలికాం సంస్థ ప్లాన్ వోచర్లు, ప్రత్యేక టారిఫ్ వోచర్లు, కాంబో వోచర్ల రూపంలో కనీసం ఒక 30 రోజుల ప్లాన్‌ను అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం 'టారిఫ్ ఫోర్బెరెన్స్' విధానం అమలులో ఉండటంతో ధరలు, సర్వీసు నిబంధనలు నిర్ణయించుకునే స్వేచ్ఛ ఆపరేటర్లకు ఉంది. అయినప్పటికీ, వినియోగదారులను ఇబ్బంది పెట్టకుండా ట్రాయ్ నిరంతరం పర్యవేక్షిస్తోంది. పార్లమెంటులో ఎంపీలు లేవనెత్తిన అభ్యంతరాలు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో.. రీఛార్జ్ వ్యాలిడిటీ పీరియడ్, ఇన్‌కమింగ్ కాల్స్ నిలిపివేత అంశాలను ట్రాయ్ ప్రస్తుతం పునసమీక్షిస్తోంది. ఒకవేళ రెగ్యులేటర్ కఠిన నిర్ణయం తీసుకుంటే ఇకపై మొబైల్ బిల్లుల భారం తగ్గడమే కాకుండా డేటా వినియోగంలోనూ పారదర్శకత వచ్చే అవకాశం ఉంది.

కార్తి జోడీగా?

ప్రస్తుతం తమిళనాడు రాజకీయ పరిణామాలకు కథానాయిక త్రిష కేంద్రబిందువుగా మారింది. మరోవైపు ఆమె రాజకీయాల్లోకి రావాలంటూ అభిమానుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. అయితే ఈ విషయాలేవీ పట్టించుకోకుండా కొత్త సినిమా సన్నాహాల్లో త్రిష బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం కార్తి జోడీగా ఈ భామ ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. మోహన్‌రాజా దర్శకత్వంలో కార్తి కొత్త చిత్రాన్ని ఇటీవలే ప్రకటించారు. త్వరలో షూటింగ్ ప్రారంభంకానుంది. ఈ సినిమా కోసం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం నయనతార, త్రిష పేర్లను ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నయనతార ప్రస్తు తం వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఆమె డేట్స్ సర్దుబాటు అయ్యే అవకాశాలు లేవని అంటున్నారు. దాంతో ఈ సినిమాలో త్రిష ను నాయికగా ఖరారు చేయబోతున్నారని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ది. 'పొన్నియన్ సెల్వ న్' చిత్రంలో కార్తి-త్రిష జోడీగా నటించారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్ అభిమానుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది.

'ఆయా షేర్' పాటతో లక్ష జడల అమ్మకం: నేచరల్ స్టార్ నాని

నేచరల్ స్టార్ నాని తన తదుపరి చిత్రం 'ప్యారడైజ్' ప్రమోషన్‌లలో భాగంగా పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలోని 'ఆయా షేర్' పాట విడుదలైన తర్వాత తన హెయిర్‌స్టైల్‌కు విశేష స్పందన లభించిందని ఆయన తెలిపారు. ఆ పాట చూసిన తర్వాత ఆన్‌లైన్‌లో ఏకంగా లక్షకు పైగా కృత్రిమ జడలు అమ్ముడయ్యాయని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సినిమా కోసం తాను శారీరకంగా ఎంతో శ్రమించానని, సిక్స్ ప్యాక్ సాధించడంతో పాటు జడలతో కూడిన విభిన్నమైన ఆహార్యంలో కనిపిస్తానని వివరించారు. 'ప్యారడైజ్' కేవలం యాక్షన్ చిత్రం మాత్రమే కాదని, ఇందులో హృదయాన్ని హత్తుకునే బలమైన తల్లి-కొడుకు సెంటిమెంట్ కూడా ఉందని నాని స్పష్టం చేశారు. ఈ సినిమాలో సీనియర్ నటుడు మోహన్ బాబు ఒక అద్భుతమైన పాత్రను పోషించారని ఆయన ప్రశంసించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల గురించి నాని ప్రస్తావిస్తూ, "దసరా చిత్రం సమయంలో ఉన్న పరిమిత అనుభవంతో కాకుండా, ఈసారి ఈ కథను అత్యంత స్పష్టతతో, పరిపూర్ణంగా తెరకెక్కించారు" అని పేర్కొన్నారు. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ కథానాయిక. సెప్టెంబరు 24న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇప్పటికే ఓవర్సీస్ లో టికెట్ సేల్స్ లో దూసుకుపోతోంది.

రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. "నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది" అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి. గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు. అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..ఙ 'చీకటిలో', 'క్రాస్ రోడ్స్' వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 'సిల్ బట్టా', 'వెట్టువం' వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి: ఉదయభాను

ఉదయభాను .. 30 ఏళ్ల క్రితమే యాంకర్ గా ఒక టీవీ షోలో గలగలమని మాట్లాడుతూ ఎంతో మంది హృదయాలను దోచుకున్నారు. ఆకర్షణీయమైన రూపంతో ఆకట్టుకునే ఉదయభానుకు అప్పట్లో ఎంతోమంది అభిమానులు ఉండేవారు. ఆ తరువాత ఒక వైపున ఈవెంట్స్ .. మరో వైపున సినిమాలు చేస్తూ ఆమె బిజీ అయ్యారు. రీసెంట్ గా 'పంచనామా' అనే వెబ్ సిరీస్ తో ఆమె నిర్మాతగా మారారు. అలాంటి ఉదయభాను తన గురించిన అనేక విషయాలను 'ఐ డ్రీమ్' వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. "నాకు నా ప్రొఫెషన్ అంటే చాలా ఇష్టం. అందువలన ఆ పనికి సంబంధించిన విషయాలను నేను సమస్యలుగా అనుకోను. నాకు సంబంధించిన వర్క్ విషయంలో నేను ఎప్పుడూ బద్ధకించలేదు .. ఎక్కడా ఆలస్యం చేయలేదు. కానీ నాకు డిసిప్లిన్ లేదనే పుకారు పుట్టించారు. అంతే కాదు ఒక ఈవెంట్ కి గానీ .. ఒక షోకి గాని నేను పెద్ద మొత్తంలో తీసుకుంటానని ప్రచారం చేస్తూ, అవకాశాలు నా వరకూ రాకుండా చేశారు. అలాంటివి విన్నప్పుడు నాకు చాలా బాధ కలుగుతుంది" అని అన్నారు. "నేను ఎప్పుడూ చాలా యాక్టివ్ గా ఉంటాను. కానీ నేను చాలా 'డల్' అయ్యాననే విషయాన్ని నలుగురికి తెలిసేలా చేయడానికి కొంతమంది ప్రయత్నించడం నా ముందే జరిగింది.

నాన్‌స్టాప్ షెడ్యూల్‌లో 'ఫౌజీ'

అగ్ర కథానాయకుడు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్' 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఇటలీ విహారయాత్ర నుంచి తిరిగొచ్చిన ఆయన హైదరాబాద్‌లో జరుగుతున్న 'ఫౌజీ' షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. డిసెంబర్ 3న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఈ సినిమా షూట్‌ను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభాస్ ఉన్నారట. అందుకోసం ఆగస్ట్ నెల మొత్తాన్ని ఈ సినిమాకే కేటాయించారని తెలిసింది. తాజా షెడ్యూల్ నాన్‌స్టాప్‌గా జరుగుతుందని, ప్రభాస్‌పై కొన్ని యాక్షన్ ఘట్టాలతో పాటు కీలక సన్నివేశాలను తెరకెక్కించబోతున్నారని తెలిసింది. 1940 దశకం నాటి స్వాతంత్ర్య సంగ్రామం, రెండో ప్రపంచయుద్ధం తాలూకు ఘటనల నేపథ్యంలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.

చిరంజీవికి జోడీగా స్నేహ..? 'కాకా'పై భారీ అంచనాలు

చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం 'కాకా'పై చుట్టూ ఇండస్ట్రీలో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటి స్నేహ చిరంజీవికి జోడీగా భార్య పాత్రలో కనిపించనున్నారనే వార్త సినీ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్లయిన నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణలతో పాటు చిరంజీవితోనూ నటించిన అరుదైన మైలురాయిని స్నేహ సొంతం చేసుకుంటారు. మరోవైపు, చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడ్యూసర్లతో చిరంజీవి ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, త్వరలోనే ఫస్ట్ సింగిల్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్వా పరిశ్రమలో పనిచేసే 'కె. సత్యం' అనే సాధారణ వ్యక్తి వెనుక ఉన్న భిన్నమైన యాక్షన్ కోణంతో సాగే కథలో నటి అనశ్వర రాజన్ 'అమ్ములు పాప'గా ముఖ్య పాత్ర పోషిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ వేగంగా అడుగులు వేస్తున్నారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com